సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 1 । మే । 2023



యాదాద్రిలో భక్తుల రద్దీ
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది.
- 10లో



ముస్తాబవుతున్న బుద్ధవనం
మే 5వ తేదీన జరగనున్న బుద్ధ జయంతి ఉత్సవాలకు నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం ముస్తాబవుతోంది.
- 10లో

గరిష్టం/కనిష్టం
35° / 23°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మోదీ హయాంలోనే దేశాభివృద్ధి



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు

వలిగొండ : మండలకేంద్రంలో బీజేపీ జిల్లా నాయకుడు ఏలే చంద్రశేఖర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు ఆదివారం ప్రారంభించారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందన్నారు. అనంతరం మోదీ ప్రసంగించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో నర్ల నర్సింగరావు, దాంతురి సత్తయ్య, చందా మహేందర్‌గుప్తా, బంధారపు లింగస్వామి, సీఎన్ రెడ్డి, బంధారపు రాములు, బచ్చు శ్రీనివాస్, అనిల్‌కుమార్, సంతోష్, అమరేందర్ పాల్గొన్నారు.

బీబీనగర్ : మండలంలోని రాఘవాపురంలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి, పాట్లోళ్ల శ్యామ్‌గౌడ్, సర్పంచ్ స్వప్న కృష్ణ తదితరులు వీక్షించారు.

శ్రమశక్తి అవార్డుకు ఎంపిక



కోటేశ్వర్

సంస్థాన్ నారాయణపురం : మేడే పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చే శ్రమశక్తి అవార్డుకు సంస్థాన్‌నారాయణపురం మండలంలోని లింగవారిగూడేనికి చెందిన మంచికంటి కోటేశ్వర్ ఎంపికయ్యాడు. కోటేశ్వర్ ఐకేపీ వీవోఏగా పని చేస్తున్నాడు, ఉద్యోగుల హక్కులు, తెలంగాణ ఐకేపీ, వీవోఏ ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసి వారి సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నాడు. ఆయన చేసిన సేవలకు గాను కార్మిక శాఖ శ్రమశక్తి అవార్డుకు ఎంపిక చేసింది. నేడు హైదారాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డు అందుకోనున్నట్లు కోటేశ్వర్ తెలిపారు.

ప్రశాంతంగా బీసీ గురుకుల కళాశాలల పరీక్ష



భువనగిరిలో విద్యార్థుల హాల్ టికెట్‌లను పరిశీలిస్తున్న సిబ్బంది

భువనగిరి : మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షల నిర్వహణకు ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30గంటలరకు జరిగింది. 1,500 మంది విద్యార్థులకు గాను 1,328 మంది హాజరయ్యారు. 172 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ 1,319 మంది విద్యార్థులకు 1,165 మంది పరీక్ష రాశారు. 154 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ 181 మంది విద్యార్థులకు గాను 163 మంది హాజరయ్యారు. 18 మంది హాజరుకాలేదని బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు.

ధర్మాపురం అభివృద్ధికి కృషి



కార్యకర్తలతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాపురంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సందర్శించి పూజలు నిర్వహించారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి రూ.1 లక్ష విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ అండెం సంజీవరెడ్డి, మాజీ వార్డు సభ్యులు జినుకల కనకయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండగోని రామచంద్రుగౌడ్, అంకర్ల రమేష్, నల్ల లింగయ్య, యల్లంల మదార్, వర్రె మధు, అంబటి నర్సయ్య, వెంకటయ్య, రావుల రవి, అంబటి రాజు, మధు, ఏనుగుల నర్సింహ, యాదవరెడ్డి, నల్ల హరికృష్ణ, రవిపాల్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం.. దైన్యం



ఆదివారం కురిసిన వర్షానికి ఆత్మకూర్(ఎం) మండలం రహీంఖాన్‌పేట కొనుగోలు కేంద్రంలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు



యాదగిరిగుట్ట మండలం చొల్లేరుకు చెందిన వద్దిగల నర్సమ్మ నాలుగు ఎకరాల్లో వరి సాగు చేసింది. వడ్లను అమ్మడానికి చొల్లేరు సెంటర్‌కు తీసుకువచ్చింది. తేమ శాతం రాకపోవడంతో వారం రోజులుగా ఆరబెడుతుంది. తూకం వేద్దామనుకున్న సమయంలోనే వర్షం కురువడంతో వడ్లు తడిసిపోయాయి. తడిసిన వడ్లను మళ్లీ ఆరబెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. తేమశాతం రాకుంటే వడ్లను అధికారులు కొనుగోలు చేయడం లేదని నర్సమ్మ ఆవేదన వ్యక్తం చేసింది.

కొనుగోలు కేంద్రాలకు వెల్లువలా ధాన్యం
- కాంటా వేయడంలో తీవ్ర జాప్యం
- 12 రోజులైనా ఆరు వేల మెట్రిక్ టన్నులే సేకరణ
- అకాల వర్షాలకు తడుస్తున్న ధాన్యం
- కేంద్రాల్లోనే రైతుల నిరీక్షణ

సాక్షి, యాదాద్రి : మంచి దిగుబడి వచ్చిందని కల్లాల వద్ద అన్నదాత పొందిన ఆనందం.. కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చేసరికి ఆవిరవుతోంది. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంతో వడ్ల కుప్పల వద్ద పగలు, రాత్రి కాపలా కాయాల్సి వస్తోంది. కంటినిండా నిద్రలేక రోజుల తరబడి జాగారం చేయాల్సి వస్తోంది. ఐకేపీ, పీఏసీఎస్ రెండు వారాలు కావొస్తున్నా ఇప్పటి వరకు ఆరు +, మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. మరో వైపు అకాల వర్షాలు అన్నదాతకు ఆందోళనకు గురి చేస్తున్నాయి.

మండలాల వారీగా ఇలా..
కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వెల్లువలా వస్తున్నా అదే స్థాయిలో కాంటా కావడం లేదు. చాలా చోట్ల అవసరం మేరకు హమాలీలు, కాంటాలు, లారీలు, ఇతర యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది.

❖ ఆత్మకూర్ (ఎం) మండలంలో కొనుగోలు కేంద్రాల నిండా ధాన్యం రాశులు పేరుకుపోయాయి. ఇక్కడ అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించడానికి ఇప్పటి వరకు అధికారులు రాలేదు.

❖ బీబీనగర్ మండలంలో గన్నీ బ్యాగులు కొరత, హమాలీలు అందుబాటులో లేకపోవడంతో కొనుగోళ్లు ప్రారంభించ లేదు.

❖ వలిగొండ మండలంలో వర్షాలకు ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి తర్వాతనే కాంటా వేస్తామని కేంద్రాల నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. --భూదాన్‌పోచంపల్లి మండలంలో హైబ్రిడ్ ధాన్యం బి గ్రేడు తొలుత కొనుగోలు చేస్తామంటే రైతులు వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది.

❖ వలిగొండ మండలంలో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని బీ గ్రేడ్ కింద కొనుగోలు చేస్తామని అధికారులు అంటున్నారని రైతులు వాపోతున్నారు.

❖ గుండాల మండల కేంద్రంలో ధాన్యం వచ్చి 25 రోజులు గడుస్తున్నా కాంటా ప్రారంభించలేదు. దీంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసింది. ఆరబెట్టిందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

❖ యాదగిరిగుట్ట మండలంలో తడిసిన ధాన్యం ఆరబెట్టిన తర్వాతనే తీసుకుంటున్నారు. తేమ శాతం రాకపోవడంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. మండల వ్యాప్తంగా శుక్రవారం నాటికి ఏడు లారీల ధాన్యం కొనుగోలు చేశారు. హమాలీ చార్జి బస్తాకు రూ.16 నుంచి రూ.18వరకు తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. కేంద్రాలకు వచ్చిన ధానాన్ని వెంటవెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలుకు కొర్రీలు
వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించినా అమలు కావడం లేదు. కొనుగోళ్లకు కేంద్రాల నిర్వాహకులు కొర్రీలు పెడుతూ క్వింటాకు నాలుగు కిలోలు తరుగు తీస్తున్నారు. ఇదేమని రైతులు అడిగితే తడిసిన వడ్లను ఆరబెడితే తప్ప.. కొనుగోలు చేయమని పేచీ పెడుతున్నారు. భువనగిరి వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఇదే పరిస్థితి ఎదుర్కొన్నారు. క్వింటాకు 4 కిలోలు కట్ చేస్తున్నారు. ఆత్మకూర్.ఎం మండలంలో 41 కిలోల తూకం వేస్తూ 39 కిలోలకే ట్రక్ షీట్ రాస్తున్నారని, బస్తా బరువు రెండు కిలోలు తీస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.

10 బస్తాల వడ్లు కొట్టుకుపోయాయి



కప్రాయపల్లి కొనుగోలు కేంద్రానికి ఎనిమిది ట్రాక్టర్ల ధాన్యం తీసుకువచ్చాం. కాంటా వేయడంలో జాప్యం జరగడంతో అకాల వర్షాలకు సుమారు 10 బస్తాల ధాన్యం వాన నీటిలో కొట్టుకుపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తీరా మార్కెట్‌కు తెచ్చిన తర్వాత కొట్టుకుపోవడం కన్నీళ్లు తెప్పించింది. తడిసిన ధాన్యాన్ని పరిశీలించడానికి ఎవ్వరూ రాలేదు.
– కొంగరి లక్ష్మి, కప్రాయపల్లి, ఆత్మకూరు(ఎం) మండలం

క్వింటాకు నాలుగు కిలోలు తరుగు తీస్తున్నారు




ధాన్యం కేంద్రానికి తీసుకవచ్చి వారం రోజులు అవుతుంది. ఇటీవల కురిసిన వర్షానికి సుమారు 10 బస్తాల ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యాన్ని రోజు ఆరబోస్తున్నాం. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కాని క్వింటాళ్లకు 4 కిలోల ధాన్యం కట్ చేస్తున్నారు. సుమారు 4 ట్రాక్టర్ల ధాన్యం తీసుకవచ్చిన ప్రస్తుతం రెండు ట్రాక్టర్ల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా తడిసిన ధాన్యంతో పాటు రెండు ట్రాక్టర్ల ధాన్యం ఉంది.
– మొగిలి దేవేందర్‌రెడ్డి, బొమ్మాయిపల్లి, భువనగిరి

సగం ధాన్యం తడిసింది



కొనుగోలు కేంద్రానికి అమ్మకానికి తెచ్చిన వడ్లలో అకాల వర్షాలకు సగానికి పైగా తడిసిపోయాయి. ఆరబెట్టుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డాం. ఆరబెట్టిన వడ్లు తూర్పార బట్టి కుప్ప బోసినం. తూకం వేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మళ్లీ వర్షం పడితే ధాన్యం అంతా తడిసే ప్రమాదం ఉంది. అధికారులు త్వరితగతిన తూకం వేయాలి.
– మేకల ధనమ్మ, గుండాల

● శ్రమజీవులకు సలామ్



క్వారీలో.. కార్ఖానాలో.. ఇటుక బట్టీలో.. నిప్పుల కొలిమిలో.. ఇలా అన్నింటా నువ్వే.. వెలకట్టలేని త్యాగానికి అర్థం నీవు.. శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకవు నీవు.. శ్రమశక్తిని చాటి చెప్పే కార్మికుడా సలామ్. నేడు అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి

పాఠ్యపుస్తకాలు వస్తున్నాయ్

- పాఠశాలల పునఃప్రారంభం రోజునే పంపిణీ చేయనున్న అధికారులు
- ఇప్పటి వరకు జిల్లాకు చేరిన 1.18 లక్షల పుస్తకాలు
- మిగిలిన పుస్తకాలు త్వరలోనే వచ్చే అవకాశం



గోదాములో భద్రపరిచిన పాఠ్య పుస్తకాలు

భువనగిరి: ఇప్పటివరకు పాఠశాలల పునఃప్రారంభం తర్వాత విడతల వారీగా పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తుండడంతో ఆ ప్రభావం విద్యార్థులపై పడేది. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఈ తరహా కష్టాలు దూరం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2023– 24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు సరఫరా చేయాలని భావిస్తోంది. ఈమేరకు ప్రస్తుత విద్యాసంవత్సరం ముగుస్తున్న సమయంలోనే పాఠ్యపుస్తకాలను జిల్లా కేంద్రంలోని గోదాములకు చేరుస్తున్నారు.

సుమారు 3.20 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం
గత విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం తరగతులను హడావుడిగా ప్రారంభించారు. దీంతో పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించలేకపోయారు. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సారి ఆ ఇబ్బంది తలెత్తకుండా అన్ని తరగతుల, టైటిళ్ల పుస్తకాలను పంపించే ప్రక్రియ చేపట్టారు. జిల్లాలోని పాఠశాలల్లో తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్య వివరాలు యూడైస్ ప్రకారం చైల్డ్ ఇన్ఫో వెబ్‌సైట్‌లో ఉంటాయని వాటి ప్రకారమే అవసరమైన పాఠ్యపుస్తకాలను రాష్ట్ర విద్యాశాఖ పంపించనుందని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాకు రాబోయే విద్యా సంవత్సరానికి సుమారు 3.20 లక్షల పాఠ్యపుస్తకాల అవసరం కానున్నాయి. ఇప్పటి వరకు జిల్లాకు 1,18,225 పాఠ్యపుస్తకాలు రాగా ఇందులో 48 టైటిల్స్ ఉన్నాయి. మిగిలిన పాఠ్యపుస్తకాలు త్వరలోనే వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఈనెల అన్ని పుస్తకాలు వస్తాయి
ప్రస్తుతం కొన్ని రకాల టైటిల్స్‌తో పాటు పాఠ్య పుస్తకాలు వచ్చాయి. ఈ నెల రెండో వారం నాటికి పూర్తి స్థాయిలో వస్తాయి. వచ్చిన వెంటనే మండలాలకు సరఫరా చేస్తాం. పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలను అందజేయడం జరుగుతుంది. ఈసారి ముందుగానే పుస్తకాలు ఇవ్వడం వల్ల ఇబ్బందులు తలెత్తకుండా బోధన సవ్యంగా సాగుతుంది.
– నారాయణరెడ్డి, జిల్లా విద్యాధికారి

వేసవి ఆటలకు వేళాయే..



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

- నేటి నుంచి క్రీడా శిక్షణ శిబిరాలు
- జిల్లాలో 16 చోట్ల ఏర్పాటు
- చిన్నారుల్లో ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు దోహదం

భువనగిరి : మొన్నటి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆటాపాటలతో సందడి చేయనున్నారు. ఏటా పాఠశాలలకు సెలవులు ప్రకటించగానే వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తుంటారు. కరోనా కారణంగా రెండేళ్ల ఇబ్బందులు ఎదురైనా ఈసారి శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు జిల్లా క్రీడల, యువజన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఈ శిబిరాలు మే 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

14 ఏళ్ల లోపు బాలబాలికలకు శిక్షణ
గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని చిన్నారుల ప్రతిభను వెలుగులోకి తీసుకోచ్చేందుకు ప్రభుత్వ వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తుంది. ఆయా ప్రాంతాల్లో డిమాండ్ ఉన్న క్రీడల్లో 14 ఏళ్ల లోపు బాలబాలికలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన శిబిరాలకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. శిబిరాల్లో క్రీడలతో పాటు సాంస్కృతిక, డ్రాయింగ్, పేపర్‌క్రాఫ్ట్ వంటి అంశాలపైన కూడా శిక్షణ ఇవ్వనున్నారు.

ఈ ప్రదేశాల్లో శిబిరాలు

క్రీడాంశం	ప్రాంతం	శిక్షకుడు	ఫోన్ నంబర్
గ్రామీణ ప్రాంతాల్లో..			
ఫుట్‌బాల్	ముత్తిరెడ్డిగూడెం(భువనగిరి)	కె.దినకర్	9848748265
వాలీబాల్	గొలనుకొండ (ఆలేరు)	పి.నాగయ్య	9848387964
వాలీబాల్	వడాయిగూడెం (భువనగిరి)	వై.సందీప్	7674942621
వాలీబాల్	జెడ్పీహెచ్ఎస్ (అనాజిపురం)	పి.శ్రీశైలం	9000690244
ఖోఖో	జెడ్పీహెచ్ఎస్ (అనాజిపురం)	పి.అంజనేయులు	9948825855
వాలీబాల్	వంగపల్లి (యాదగిరిగుట్ట)	ఎం.నరేష్	8466992569
వాలీబాల్	ఎస్‌బీహెచ్ఎస్ (వలిగొండ)	టి.నర్సింహ	9848231242
ఖోఖో	ఎస్‌బీహెచ్ఎస్ (వలిగొండ)	ఏ.రాకేష్	9346471261
తైక్వాండో	మాంటిస్సోరి స్కూల్ (బీబీనగర్)	కె.శ్రీకాంత్	9177795383
తైక్వాండో	జెడ్పీహెచ్ఎస్ (నారాయణపూర్)	టి.మల్లేష్‌గౌడ్	91219 06140
అర్బన్ ఏరియాలో..			
తైక్వాండో	మాంటిస్సోరి స్కూల్ (భువనగిరి)	జి.కృష్ణ	9010238929
వాలీబాల్	జెడ్పీహెచ్ఎస్ (రాయగిరి)	వై.యాదగిరి	9182384391
తైక్వాండో	బ్రిలియంట్ స్కూల్ (చౌటుప్పల్)	కె.సైదులు	9912972822
ఖోఖో	జెడ్పీహెచ్ఎస్ (రాయగిరి)	ఐ.అయిలయ్య	9885515530
అథ్లెటిక్	జెడ్పీహెచ్ఎస్ (రాయగిరి)	ఎం.కుమార్	9963258742
డ్యాన్స్	భువనగిరి కోట	భరత్	8686669685

ఉదయం, సాయంత్రం వేళల్లో..
ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంలో ఉదయం 6నుంచి 8 గంటల వరకు, సాయంత్రం సమయంలో సాధన చేయిస్తారు. శిబిరాల నిర్వహణకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ జిల్లాకు రూ.1.05 లక్షలు కేటాయించింది. జిల్లా వ్యాప్తంగా 16 చోట్ల శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 10, అర్బన్ ఏరియాల్లో 6 కేంద్రాలు ఉన్నాయి. శిబిరం నిర్వహించే శిక్షకుడికి రూ.4 వేలు గౌరవ వేతనం ఇవ్వనున్నారు. మిగిలిని నిధులను క్రీడా సామగ్రి కొనుగోలు ఇతర అవసరాలకు వినియోగించనున్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి

భూదాన్‌పోచంపల్లి : చేనేత వస్త్రాలపై జీరో జీఎస్టీ సాధన కోసం ఈ నెల 7వ తేదీన నిర్వహించతలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం చేనేత విభాగం జాతీయ అధ్యక్షుడు యర్రమాద వెంకన్ననేత ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. చేనేతపై కేంద్ర ప్రభుత్వం పన్నులు విధించడం సరికాదన్నారు. జీఎస్టీని ఎత్తివేయాలని 17 నెలలుగా దేశవ్యాప్త ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలో జరిగే మహాప్రదర్శనకు వివిధ పార్టీల జాతీయ నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లా నుంచి చేనేత కార్మికులు, నాయకులు, అనుబంధ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పలకరిస్తూ.. సమస్యలు వింటూ..



ఆలేరు మండలం పటేల్‌గూడెం వద్ద వర్షంలోనే పాదయాత్ర చేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, చిత్రంలో డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, కుదుదుల నగేష్, జనగాం ఉపేందర్‌రెడ్డి

- తొలి రోజు ఆలేరు వరకు కొనసాగిన పాదయాత్ర
- వర్షంలోనే పాదయాత్ర కొనసాగించిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

యాదగిరిగుట్ట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు తెలియజేసి తెలంగాణలో ప్రజాప్రభుత్వాన్ని తీసుకురావడానికి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదివారం మధ్యాహ్నం జిల్లాలోకి ప్రవేశించింది. జనగామ జిల్లా పెంబర్తి శివారులోని కాకతీయ కళా తోరణం నుంచి ఆలేరు నియోజకవర్గంలో అడుగిడింది. ఒంటి గంటకు భట్టి విక్రమార్క వరంగల్ – హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రం వద్ద భోజనం చేశారు. సాయంత్రం 5.40 వరకు పార్టీ నాయకుతో మాట్లాడారు. ఆలేరు నియోజకవర్గంలో సమస్యలు తెలుసుకున్నారు. 5.45కు తిరిగి యాత్ర ప్రారంభించారు. వర్షం కురుస్తున్నా పాదయాత్రను కొనసాగించారు.

నాలుగు కిలో మీటర్లు వర్షంలోనే..
భట్టి విక్రమార్క కాకతీయ కళాతోరణం నుంచి ఆలేరు మండలం శ్రీనివాసపురం వరకు నాలుగు కిలో మీటర్ల దూరం వర్షంలోనే పాదయాత్ర కొనసాగించారు. పటేల్‌గూడెం వద్ద తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతు శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించారు. ధాన్యం తెచ్చి పది రోజులు అవుతుందని, ఐకేపీ కేంద్రం ప్రారంభించకపోవడంతో వర్షాలకు ధాన్యం తడిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా మహిళలు తమ సమస్యలు చెప్పుకున్నారు. డబుల్ బెడ్రూమ్ ఇల్లు రాలేదని, మూడు ఎకరాల భూమి ఇవ్వలేదని, చదువుకున్న పిల్లలకు కొలువులు రాలేదని గ్రామానికి చెందిన రమ్య, మాలతి, రేణుక వివరించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరకపోవడంతోనే తాను పాదయాత్ర చేస్తున్నానని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, సమస్యలన్నీ తీరుస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. అక్కడి నుంచి గుండ్లగూడేనికి చేరుకున్న భట్టి విక్రమార్కకు గ్రామస్తులు పలు సమస్యలను తెలియజేశారు. అనంతరం ఆలేరుకు పాదయాత్ర చేరుకుంది. స్థానిక రైల్వేగేట్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. సమావేశం అనంతరం ఆలేరులోనే రాత్రి బస చేశారు.



పటేల్‌గూడెం వద్ద మహిళా రైతులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

నేడు పాదయాత్ర కొనసాగే ప్రాంతాలు
పాదయాత్ర సోమవారం ఆలేరులో 9 గంటలకు తిరిగి ప్రారంభమై కొలనుపాకకు చేరుకోనుంది. అక్కడ కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు. అనంతరం రాజానగరం చేరుకొని మధ్యాహ్న భోజనం చేస్తారు. ఆ తర్వాత రాజాపేట మండలం దూదివెంకటాపురం మీదుగా రఘునాథపురం వెళ్తారు. అక్కడ నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు. రాత్రి రఘునాథపురంలోనే బస చేయనున్నారు.

పోతరాజులు.. ఒగ్గు డోళ్లతో స్వాగతం
భటి విక్రమార్క పాదయాత్రకు కార్యకర్తలు డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాల నడుమ స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో మహిళలు తిలకం దిద్ది, మంగళహారతులు పట్టి స్వాగతించారు. పాదయాత్రలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, పీసీసీ జనరల్ సెక్రెటరీ బీర్ల ఐలయ్య, పీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్, పీసీసీ మాజీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, ఆలేరు నియోజకవర్గ నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, కో ఆర్డినేటర్ నీలం పద్మ, పీసీసీ జనరల్ సెక్రెటరీ పోత్నక్ ప్రమోద్ కుమార్, పీసీసీ సభ్యులు రవికుమార్, అండెం సంజీవరెడ్డి, ఎంపీపీలు అశోక్, చీర శ్రీశైలం, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

అనిల్, బీర్ల అయిలయ్య వాగ్వాదం
సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా ఆలేరులోని రైల్వే గేట్ వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీర్ల ఐలయ్య మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సభా వేదికపై పలువురు నేతలు ప్రసంగిస్తుండగా వర్షం కురిసే అవకాశం ఉంది.. ముఖ్య నేతలతోనే మాట్లాడించాలని బీర్ల ఐలయ్యకు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. దీంతో బీర్ల ఐలయ్య ఆలేరు నియోజకవర్గం గురించి మీకు తెలియదు నేను ఇక్కడ ఇన్‌చార్జిని అంటూ సమాధానం ఇచ్చారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. భట్టి విక్రమార్క కలగజేసుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. వేదికపై చోటు చేసుకున్న ఈ ఘటనతో పార్టీ శ్రేణులు కంగుతిన్నారు.



వేదికపై భట్టి విక్రమార్క ఎదుటనే వాగ్వాదం చేసుకుంటున్న కుంభం, బీర్ల అయిలయ్య

క్లుప్తంగా

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

మోతె: మండల పరిధిలో సింగరేనిపల్లె టోల్ గేట్ వద్ద ఆదివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టీఎస్ 30 టీ 8055 నంబర్ గల లారీలో డ్రైవర్ బొడిగ నరేష్, లారీ ఓనర్ బచ్చలబోయిన యాదయ్య, చివార్ల నరేష్ ఎలాంటి అనుమతులు లేకుండా ఆంధ్రా ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో మోతె మండల పరిధిలోని సింగరేనిపల్లె టోల్‌గేట్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా పట్టుకున్నారు. లారీతో పాటు మరో కారును సీజ్ చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగభూషణం తెలిపారు.

విద్యుదాఘాతంతో కాడెడ్లు మృతి



మృతిచెందిన కాడెడ్లతో నాగారం-తుంగతుర్తి రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

మద్దిరాల: విద్యుదాఘాతంతో కాడెడ్లు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడవెల్లి గ్రామవాసి అయిన జక్కి శ్రీనివాస్‌కు చెందిన రెండు కోడెలు తన వ్యవసాయ భూమిలో మేత మేస్తూ పక్కనే ఉన్న నీటి గుంటలో నీళ్లు తాగి బయటికి వస్తున్నాయి. ఈ క్రమంలో కిందకు వేలాడుతున్న 11కేవీ విద్యుత్ తీగలు తగిలి అవి రెండు అక్కడికక్కడే మృతిచెందాయి. కాగా ఈదురు గాలులకు 11కేవీ విద్యుత్ తీగలు కిందకు వేలాడి ప్రమాదంగా ఉన్నాయని పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మృతిచెందిన కాడెడ్ల విలువ రూ.2లక్షల ఉంటుందని, విద్యుత్ అధికారులు నష్టపరిహారం అందజేయాలని బాధిత రైతుతో పాటు మరికొందరు తుంగతుర్తి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు తుంగతుర్తి-నాగారం ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు.

దొంగను పట్టుకున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి కొండ కింద గల నూతన బస్ స్టేషన్‌లో ఆదివారం ఉదయం ఓ మహిళా భక్తురాలు మెడలోంచి దొంగ పుస్తెల తాడు చోరీ చేసేందుకు యత్నించగా, భక్తులు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. భక్తులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి క్షేత్రానికి వచ్చిన ఓ మహిళా భక్తురాలి మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి బంగారు పుస్తెల తాడు దొంగిలించే యత్నం చేశాడు. అక్కడే ఉన్న భక్తులు అప్రమత్తమై ఆ దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఇదే బస్ స్టేషన్‌లోనే ఉదయం ఒక భక్తుడి జేబులోంచి గుర్తుతెలియని వ్యక్తులు రూ.9వేలు చోరీ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై పట్టణ ఎస్‌ఐ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా చోరీ జరిగిన విషయం నిజం కాదని, భక్తుల మధ్య గొడవ జరిగిందని తెలిపారు.

• సచివాలయం ప్రారంభోత్సవంలో నేతలు

హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన డా. బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయాన్ని ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు ఈ కార్యక్రమానికి హాజరై కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి జగదీష్‌రెడ్డి సచివాలయంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.



సచివాలయం ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శాలువా కప్పుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ బడుగుల లింగయ్య



సీఎం కేసీఆర్‌కు యాదాద్రి ప్రసాదం అందజేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్



కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



సీఎం కేసీఆర్‌కు బొకే ఇస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్



బాధ్యతలు స్వీకరించిన మంత్రి జగదీశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు కంచర్ల, కిశోర్, చిరుమర్తి, సైదిరెడ్డి తదితరులు



మంత్రి జగదీశ్‌రెడ్డితో సూర్యాపేట జెడ్పీ చైర్మన్ గుజ్జ దీపిక



మంత్రి జగదీశ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే రవీంద్రకుమార్



మంత్రి జగదీశ్‌రెడ్డిని ఆలింగనం చేసుకుంటున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



మంత్రి జగదీశ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న తిప్పన విజయసింహారెడ్డి

సిబ్బందిపై రెస్టారెంట్ యాజమాన్యం దాడి

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని ఓ రెస్టారెంట్ యాజమాన్యం అందులో పనిచేసే సిబ్బందిపై చేయి చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. ఇటీవల ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాసిన రామునిగుండ్లకు చెందిన ఆంగోతు ఆది, ఆంగోతు అనిల్ హాలియాలో ఉండే ఓ మధ్యవర్తి ద్వారా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని చిల్లి రెస్టారెట్‌లో పనికి కుదిరారు. అయితే శనివారం రాత్రి తమపై సదరు రెస్టారెంట్ యాజమాన్యం దరుసుగా ప్రవర్తించడంతో పాటు చేయి చేసుకున్నారని, గొంతు కింద గోర్లు గీరుకుపోయాయని ఇరువురు విద్యార్థులు స్థానికులకు వివరించారు. ఈ విషయమై రెస్టారెంట్ యాజమాన్యాన్ని వివరణ కోరగా.. చెప్పిన పని చేయకపోవడంతో మందలించామని, వారిపై చేయి చేసుకోలేదని పేర్కొన్నారు. వివరణ కోరిన విలేకరులపై రెస్టారెంట్ యాజమాన్యం ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. కాగా తమపై దాడి చేసిన రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఇరువురు విద్యార్థులు కోరుతున్నారు.

గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత



పట్టుబడిన గోవులు

చింతపల్లి: అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం చింతపల్లి మండల కేంద్రంలో భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు అడ్డుకున్నారు. మల్లేపల్లి వైపు నుంచి హైదరాబాద్‌లోని కబేళాలకు 15 గోవులను తరలిస్తుండగా వాహనాన్ని అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన గోవులను మహబూబ్‌నగర్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలోని గోశాలకు తరలించినట్లు ఏఎస్ఐ చంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సౌదీలో యాదాద్రి జిల్లావాసి మృతి

• గుండెపోటుతో మృతి



శివ (ఫైల్)

భువనగిరి: సౌదీ అరేబియాలో యాదాద్రి జిల్లా కేంద్రం భువనగిరికి చెందిన యువకుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన దొమ్మాటి వెంకటేష్, వరలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు దొమ్మాటి శివ(28) హోటల్ మెనేజ్‌మెంట్ కోర్సు చేశాడు. ఐదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియా వెళ్లాడు. సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. కరోనా ప్రభావంతో రెండేళ్ల క్రితం తిరిగి భువనగిరికి వచ్చారు. ఇక్కడ కొంతకాలం ఉన్నాడు. తిరిగి 2022 జనవరి 3వ తేదీన సౌదీ అరేబియాకు వెళ్లా డు. భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం విధుల్లో ఉండగా గుండెపోటు రావడంతో తోటివారు సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మధ్యాహ్నం తర్వాత భువనగిరిలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని భువనగిరికి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు.

అమ్మా.. ఆరోగ్యం జాగ్రత్త..

మృతుడి తల్లిదండ్రులు భువనగిరి రైతుబజార్‌లో కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇద్దరు కుమారులను ఉన్నత చదువులు చదివించారు. సౌదీ అరేబియాకు వెళ్లిన శివ భువనగిరికి వచ్చినప్పుడు తల్లిదండ్రులతో కలిసి కూరగాయలు విక్రయించేవాడు. కాగా ఎప్పటి మాదిరిగా ఏప్రిల్ 29వ తేదీన రాత్రి తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి మాట్లాడాడు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని తమకు సూచించాడని తల్లిదండ్రులు విలపిస్తూ చెప్పారు. కాగా శివ 1995 మే 8వ తేదీన జన్మించాడు. మరో వారం రోజులైతే తమ కొడుకు పుట్టినరోజు ఉందని కన్నీరుమున్నీరయ్యారు.

అకాల వర్షం.. అతలాకుతలం



రాయగిరి-మోత్కూరు మెయిన్ రోడ్డుపై భారీ వృక్షం కూలడంతో నిలిచిన రాకపోకలు

ఆత్మకూరు (ఎం): మండల కేంద్రంలో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గంటసేపు భారీ వర్షం కురిసింది. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయగిరి-మోత్కూరు ప్రధాన రహదారిపై మండల కేంద్రం పరిధిలో భారీ చెట్టు పడడంతో సుమారు గంటసేపు రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు చెట్టును రోడ్డు పైనుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గుండాలలో..

గుండాల: మండల వ్యాప్తంగా ఆదివారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. పలు కొనుగోలు కేంద్రాల్లో వర్షపు నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. ధాన్యం రాశులపై కప్పిన పట్టాలు గాలికి లేచిపోయాయి. గుండాలలో బండపై పోసిన వరి ధాన్యం రామ సముద్రం చెరువులో కలిసింది.



గుండాల: అంబాలలో బురదమయంగా మారిన కొనుగోలు కేంద్రం

ఒడిశా వలస కార్మికులకు విముక్తి

• రైలులో స్వగ్రామాలకు పంపించిన పోలీసులు



ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఒడిశా కార్మికులతో మాట్లాడుతున్న సీఐడీ సిబ్బంది

మిర్యాలగూడ: మండలంలోని గూడూరు గ్రామ సమీపంలో గల బీఆర్‌బీ ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న 32 మంది ఒడిశా కార్మికులకు సీఐడీ పోలీసులు ఆదివారం విముక్తి కల్పించి స్వగ్రామాలకు పంపించారు. ఈ సందర్భంగా సీఐడీ డీఎస్పీ ఎర్నా మాట్లాడుతూ.. బీఆర్‌బీ ఇటుక బట్టీల్లో ఒడిశాకు చెందిన 79 మంది కార్మికులు గత జనవరి నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. అందులో 18 సంవత్సరాల బిద్యాదర్ చినగున్ మార్చి 8వ తేదీన తప్పిపోవడంతో మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కూలీలు ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విచారణలో భాగంగా ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులు ఇక్కడ పనిచేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం తెలియడంతో ఆదివారం సీఐడీ పోలీసులు కూలీల వద్దకు వెళ్లి మాట్లాడినట్లు తెలిపారు. కూలీలు సొంత రాష్ట్రానికి వెళ్లేందుకు సిద్ధమవ్వగా 79మందిలో 32 మంది కూలీలను, ఏడుగురు పిల్లలను మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కించి ఒడిశా రాష్ట్రంలోని బల్గిర్, బర్గాడ్, నౌపాడా గ్రామాలకు పంపించినట్లు పేర్కొన్నారు. తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ కనిపెట్టేందుకు విచారణ చేపడుతున్నామన్నారు. ఈ విషయమై మిర్యాలగూడ పోలీసులకు నివేదికను సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐడీ టీం ఇన్‌స్పెక్టర్ బాలు, జానకిరాములు, నాగరాజు, హనుమంతరెడ్డి, ఎస్ఐ మాధురిరెడ్డి, రెవెన్యూ, లేబర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



కిరణ్ (ఫైల్)

అనంతగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం అనంతగిరి మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఐలయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తమ్మరబండపాలెం గ్రామానికి చెందిన ఎలక నాగరాజు(24) తన బైక్‌పై కోదాడ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. గ్రామ శివారులోని రాజరాజేశ్వరి రైస్ మిల్లు వద్దకు చేరుకోగానే ముందు వెళ్తున్న కారు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వేశాడు. దీంతో బైక్‌తో కారు వెనక భాగంలో ఢీకొట్టిన నాగరాజు అక్కడే కిందపడిపోయాడు. అదే సమయంలో ఖమ్మం నుంచి కోదాడ వైపు వెళ్తున్న టిప్పర్ నాగరాజు కాళ్లపై నుంచి వెళ్లడంతో అతడి రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. వెంటనే అతడిని స్థానికులు 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి సూర్యాపేట ఏరియా హాస్పిటల్ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. మృతుడి అన్న ఎలక సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు, టిప్పర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హుజూర్‌నగర్‌లో మరొకరు...

హుజూర్‌నగర్ (చింతలపాలెం): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ సంఘటన చింతలపాలెం మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన అల్లం కిరణ్ కుమార్ (54) చింతలపాలెం మండలంలోని కిష్టాపురంలో గల తన బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి తిరిగి ఇంటి బయల్దేరాడు. ఈ క్రమంలో కిష్టాపురం గ్రామశివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో అతడు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య శ్రీకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ మెయిన్స్ ఎగ్జామ్



కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు

నల్లగొండ క్రైం: టీఎస్ఎల్‌పీఆర్‌బీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్ తుది రాత పరీక్ష (మెయిన్స్ ఎగ్జామ్) ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి నల్లగొండ పట్టణంలోనే 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 11,239 మంది అభ్యర్థులకు గాను 11,128 మంది పరీక్షకు హాజరయ్యారు. నల్లగొండ ఎస్పీ అపూర్వ రావు పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు 144 సెక్షన్ అమలు చేశారు. అన్ని ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్‌లను మూసివేశారు. నిమిషం నిబంధన అమలు చేస్తున్నట్లు పోలీసు నియామక బోర్డు ముందుగానే ప్రకటించడంతో అభ్యర్థులు ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు ముందుగానే చేరుకున్నారు. డబ్బులు ఇస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వారి మాటలు నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దని, అలాంటి వారి సమాచారం వెంటనే పోలీసులకు లేదా 100 నంబర్‌కు డయల్ చేసి ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

• కూరెళ్లకు సత్కారం



మన్ కీ బాత్ 100 ఎపిసోడ్‌లు పూర్తయిన సందర్భంగా రాజ్‌భవన్‌లో డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యను సన్మానిస్తున్న గవర్నర్ తమిళిసై



రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో పాటు చెట్లు నాటే కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య

55 ఏళ్ల తర్వాత బాల్యమిత్రులతో..



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పాపయ్య చౌదరి జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు

నడిగూడెం: మండల కేంద్రంలోని శ్రీ కొల్లు పాపయ్యచౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1967–68 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. 55 ఏళ్ల తర్వాత బాల్యమిత్రులంతా ఒకేచోట కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి రాంబాబు పాఠశాల అభివృద్ధికి రూ.50వేలు విరాళం ప్రకటించారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన అప్పటి ఉపాధ్యాయుడు షేకు వెంకటేశ్వర్లు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎల్‌వీకే ప్రసాద్, జల్లా నాగేశ్వరరావు, రాంబాబు, సీతమ్మ, జితేంద్రబాబు, షేక్ శ్రీనివాస్, ఎండీ మౌలానా, జానీమియా, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండ: ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న లిటిల్ ఫ్లవర్ పాఠశాల పూర్వ విద్యార్థులు

'లిటిల్ ఫ్లవర్' పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ విజ్ఞాన మందిర్ పాఠశాలలో 1975 నుంచి 1981 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు నల్లగొండలోని ఆర్‌టీసీ కాలనీ ఐఎంఏ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు.ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 450 మంది రోగులకు ఆహారం పంపిణీ చేశారు. మదర్ థెరిస్సా చికిత్స కేంద్రం వద్ద సుమారు 60 మంది మానసిక రోగులకు సహాయం, శిశుగృహలో పాలపొడి, న్యాప్‌కిన్‌లు పంపిణీ చేశారు. మరణించిన తమ బ్యాచ్‌మేట్ కుమార్తెను ఇంటర్మీడియట్ చదివించే బాధ్యతను తీసుకొని రూ.2లక్షలను సేకరించి గౌతమి జూనియర్ కాలేజీకి అందించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ అనితారాణి కన్వీనర్‌గా వ్యవహరించగా రేణుక, లలిత ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కేతేపల్లి: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కేతేపల్లిలో..

కేతేపల్లి : మండలంలోని చెర్కుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి(1984–89) వరకు చదివిన విద్యార్థులు ఆదివారం గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 70 మంది పూర్వ విద్యార్థులు ఇంతకాలం తర్వాత కలుసుకోవడంతో ఉద్వేగభరితులయ్యారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బండారు వేణు, ఏడాకులు కోటయ్య, పులిపాటి శేఖర్ పాల్గొన్నారు.